
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
ఆదివారం 24 నవంబరు 2024

ఉమ్మడి జిల్లా గజగజ

మెదక్‌అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి గజగజ వణికిస్తోంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 8 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి జిల్లాలోని కోహీర్‌లో 10.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా న్యాల్కల్ 10.8 గుమ్మడిదల 11.4, శివ్వంపేట 11.4, దామరంచ 11.8, అంగడికిష్టాపూర్ 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'అన్నవరం'.. సాహితీ వనం


పోతారం(ఎస్) గ్రామంలోని అన్నవరం దశరథం గృహం

ఆ కుటుంబంలో రచయితలు.. చిత్రకారులు

ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే రాణింపు
సాహిత్య సుగంధాలు.. దశరథం సంతానం
మట్టి పరిమళపు అల్లిక..
పెద్దకుమారుడు
దేవేందర్ కవిత్వం
కథ రచయిత్రి
పెద్దకోడలు రాజేశ్వరి దేవేందర్
నుడికారపు కమ్మదనం ..
కుమార్తె సుజాత కవిత్వం
కవర్‌పేజీ బొమ్మలకు కేరాఫ్
చిన్నకుమారుడు శ్రీనివాస్

7

సండే స్పెషల్
Sunday Special


పుస్తకావిష్కరణ
సభలో కుటుంబసభ్యులతో దేవేందర్

ఆ కుటుంబమే ఓ సాహిత్య పూదోట. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూనే రచనా రంగంలోనూ స్థానం సంపాదించారు. కలం కదుపుతూ పలు రచనలను వెలువరచడమే కాదు.. కుంచె కదిలిస్తూ చిత్రకళలోనూ రాణించారు. వారే అన్నవరం దశరథం కుటుంబం. ఉపాధ్యాయ వృత్తితో పాటు సైన్‌బోర్డ్ కళాకారుడిగా గతించిన దశరథం పిల్లలు సాహితీసేవలో తరిస్తున్నారు. ఆయన పెద్ద కుమారుడు ప్రముఖ కవి, రచయిత, కాలమిస్టుగా గుర్తింపు పొందిన అన్నవరం దేవేందర్ పల్లె మట్టిదనం పరిమళాన్ని దట్టించి రాసే కవితా శిఖరం. ఇంట్లోని సాహితీ వాతావరణాన్ని ఒంటబట్టించుకున్న పెద్దకోడలు రాజేశ్వరి దేవేందర్ కలాన్ని కదిలించే కథా రచయిత్రి. కుమార్తె సుజాత మన పలుకుబడులు, నుడికారాలతో రంజింపచేసే కవిత్వ శిరోమణి. రాతలు వీరైతే.. ఆకట్టుకునే కవర్‌పేజీ బొమ్మలు వేసే చిత్రకారుడు చిన్నకుమారుడు శ్రీనివాస్.

సంక్షేమమేనా

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనం, వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఆయా సమస్యలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కూడా పలు కథనాలను ప్రచురించింది. ఈ మేరకు శనివారం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. అలాగే, కలెక్టర్ మనుచౌదరి జిల్లాలోని విద్యా, సోషల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్, సివిల్ సప్లయ్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు.

హాస్టళ్లపై అధికారుల నజర్

- మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేసిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి
- వసతులు, విద్యార్థినులకు అందుతున్న భోజనంపై ఆరా
- అధికారులతో కలెక్టర్ మనుచౌదరి సమావేశం
- నాణ్యమైన భోజనం అందించాలని సూచన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి

సిద్దిపేట కల్చరల్ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22న "పురుగుల అన్నం.. కుళ్లిన కూరగాయాలు" శీర్షికతో సిద్దిపేట మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అవస్థలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి శనివారం జిల్లా న్యాయాసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి స్పందించారు. ఆమె సంబంధిత అధికారులతో కలిసి రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూలు పరిసరాలు, వంట గది, బాత్‌రూం, హాస్టల్‌ను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందుతుందా లేదా..? అన్నంలో పురుగులు వస్తున్నాయా? అనే అంశాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. హాస్టల్‌లోని ఐదుగురు విద్యార్థినులు తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నా వారికి వైద్యసహాయం అందలేదన్న విషయం తెలియడంతో స్వాతిరెడ్డి వారిని పలకరించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలో బాత్‌రూంల నిర్వహణ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం నుంచి బాత్‌రూం, డ్రైనేజీ సమస్య ఉన్నప్పటికీ పరిష్కరించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. చలికాలంలో కూడా వేడినీళ్లు ఇవ్వకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపల్, వార్డెన్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు గేమ్స్ ఆడుకోవడానికి, యోగా చేసుకోవడానికి అనుమతివ్వకపోవటమేంటని మండిపడ్డారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటుగా ప్రిన్సిపల్, వార్డెన్ వ్యవహార శైలి విషయమై పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


బాత్‌రూం వసతులను పరిశీలిస్తున్న స్వాతిరెడ్డి

డిస్ట్రిక్ లెవల్ ఫుడ్ సేఫ్టీ కమిటీ నియామకం : కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్ : పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి విద్యా, సోషల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్, సివిల్ సప్లయ్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లాలో ఆహారం అందించే ప్రతి ఒక్క విద్యాసంస్థల్లో నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని మాత్రమే అందించేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాలని సూచించారు. జిల్లాలో క్వాలిటీ తగ్గకూడదని చెప్పారు. ఇందుకోసం డిస్ట్రిక్ లెవల్ ఫుడ్‌సేఫ్టీ కమిటీ నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. వంటసామాను భద్రపరిచే గదుల్లో బొద్దింకలు, ఎలుకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే స్టీల్ బాక్సులు, ఇతర వస్తువుల కోసం సంప్రదించాలని చెప్పారు. విద్యాసంస్థలకు సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉంటే వాటిని రిప్లేస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయాశాఖల అధికారులు విద్యాసంస్థలకు వెళ్లినప్పుడు ఫుడ్ క్వాలిటీ తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆయన చెప్పారు. అంగన్‌వాడీల్లో సైతం నాణ్యమైన భోజనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు తెలిపారు. జిల్లాలోని జీజీహెచ్, ఎంసీహెచ్ ఇతర ఆసుపత్రుల్లో ఆహారం అందించడంలో ఎలాంటి రాజీపడొద్దని క్వాలిటీతో కూడిన ఆహారం లేకపోతే ఆ ఏజెన్సీ రద్దు చేయాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి


మద్దూరులోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోని వడ్ల కుప్పలపై కోతులు

దడ పుట్టిస్తున్న కోతులు

- రైతులకు తిప్పలు.. ఇళ్లలోకి చొరబడుతున్న వైనం
- లద్నూరులో తుప్పు పడుతున్న కోతులను పట్టే బోనులు
- వృథాగా గ్రామస్థుల చందాలు.. • వినియోగంలోకి తెస్తే మేలు

మద్దూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వానరాలు ప్రజలను నానా తిప్పలకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి తినుబండారాలు వస్తువులను పాడుచేస్తున్నాయి. అటు పొలాల్లో, తోటల్లో పంటలను, పండ్లను నాశనం చేస్తున్నాయి. ధాన్యం ఆరబోసిన రైతుల పరిస్థితి అయితే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ధాన్యం కుప్పలపై పడి తినేస్తున్నాయి. వాటి బాధలు పడలేక మండలంలోని లద్నూరు గ్రామ రైతులు, గృహ యజమానులు పంచాయతీ ఆధ్వర్యంలో 2020లో చందాలు వేసుకుని కోతులు పట్టే బోన్లను తయారు చేయించారు. అలాగే కోతులను పట్టడానికి చందాలు వేసుకున్నారు. చేర్యాల మండలం వేచరేణికి చెందిన కోతులు పట్టే ఇస్మాయిల్‌ను సంప్రదించగా ఒక్కో కోతిని పట్టి అడవిలో వదిలిపెట్టేందుకు రూ.150 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చందాలు సరిపోయే పరిస్థితి లేకపోవడంతో గ్రామానికి చెందిన రైతు ఒక్కో కోతికి రూ.60 ఇస్తే తాను పడతానని చెప్పారు. రూ.1.25 లక్షలతో 3 పెద్ద బోన్లు, 10 చిన్న బోన్లు స్థానిక వెల్డర్ వద్ద తయారు చేయించి అప్పగించారు. ఆ తర్వాత కోతులను పట్టి అడవిలో వదిలిపెట్టారు. మూడేళ్లుగా బోన్లను అలాగే వదిలేయడంతో తుప్పుపట్టి పోతున్నాయి. మరికొంతమంది రైతులు వాటిని చెడగొట్టి సొంత అవసరాలకు ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా కోతు లు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజల ను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. నిరుపయోగంగా బోనులను ఉపయోగించి కోతుల బెడద లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


లద్నూరు గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ భూమిలో వృథాగా మారి తుప్పుపట్టిపోతున్న కోతుల బోను


వర్గల్ నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. శంకు, చక్రం, స్వస్తిక్, ఓంకారం, స్వామివారి నామాల రూపంలో ప్రమిదలు ఏర్పాటు చేసి దీపాలు వెలిగించారు. ఆలయం వద్ద త్రిగుళ్ల కృష్ణచంద్ర శర్మ బృందంతో శివతాండవ గాన ప్రదర్శన ఏర్పాటు చేశారు
- వర్గల్, నవంబరు 23

నేడు మెరిట్ స్కాలర్‌షిప్

పరీక్ష

- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- సీపీ అనురాధ

సిద్దిపేటక్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో ఆదివారం జరిగే మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్ష జరిగే సమయంలో సమీపంలో ఉన్న జీరాక్స్ సెంటర్లు మూసివేయాలని, సెంటర్ల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు.


గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


హుస్నాబాద్‌లో స్వీట్లు పంచుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సంబురాల్లో పాల్గొన్న కార్యకర్తలు

గెలుపు సంబురాలు

హుస్నాబాద్‌రూరల్/గజ్వేల్, నవంబరు 23: మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడంతో జిల్లాలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో స్వీట్లు పంచి టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించుకున్నారు.

● వాయనాడ్‌లో ప్రియాంక గాంధీ, జార్ఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ కూటమి విజయం సాధించడంతో గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్ధార్‌ఖాన్ ఆధ్వర్యంలో, హుస్నాబాద్‌లోనూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు.

రోడ్డు పైనే వారాంతపు సంత

- కనీస సదుపాయాలు కరువు
- మినీ రైతు బజార్లు ఏర్పాటు చేయాలని అమ్మకందారుల విజ్ఞప్తి

8

జగదేవ్‌పూర్ ఎస్ఐకి రెండు అవార్డులు

జగదేవ్‌పూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తుపదార్థాలు అరికట్టడంతో పాటు సరఫరా చేసే నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించిన జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్‌ను రాష్ట్ర డీజీపీ జితేందర్ శనివారం అభినందించారు. మహబూబాబాద్ జిల్లా సిరోల్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో ఎస్ఐగా పనిచేసిన చంద్రమోహన్ ఇద్దరు నిందితులు ఆరుకిలోల గంజాయిని సరఫరా చేస్తుండగా వారిని పట్టుకున్నాడు. ఈ కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితులకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రెండు లక్షల జరిమానా విధిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో తీర్పును ఇచ్చారు. శనివారం డీజీపీ జితేందర్‌ను తన కార్యాలయంలో అభినందిస్తూ రెండు అవార్డులను అందించారు. కార్యక్రమంలో తెలంగాణ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, శాంతిభద్రతల అడిషనల్ డిజి మహేష్, భగవత్ తదితరులు ఉన్నారు.


జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్‌కు అవార్డును అందజేస్తున్న డీజీపీ జితేందర్

మాలలంతా ఏకమై కుట్రలను తిప్పికొట్టాలి

- రాజకీయంగా అణగదొక్కాలనే కుట్ర
- జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

7

'శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశ అభివృద్ధి'

పెద్దశంకరంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విజ్ఞానం దేశాభివృద్ధికి పునాదని పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో మహిళల రక్షణ - వ్యక్తిత్వ వికాసం, సైన్స్ మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలోని మూఢ నమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుంబిగించాలన్నారు. అనంతరం ఉప్పులేని నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసంచేసే కుట్రల వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విఠల్, పోలీస్ సిబ్బంది జ్యోతి, రమేష్, రవి, స్పెషల్ ఆఫీసర్ విజయ్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన



చిన్నశంకరంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు అగస్త్య అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దీప్లా రాథోడ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, వేంకటేశం, శుభోదయం బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కూలీ మృతి


నర్సింహులు (ఫైల్)

చేగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో దినసరి కూలీ మృతి చెందారు. ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండల పరిధి లోని అనంతసాగర్ గ్రామానికి చెందిన మెండె నర్సింహులు(36) చేగుంట మండల కేంద్రం లోని శ్రీ వెంకటేస్వార సామిల్‌లో దినసరి కూలి పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం పనికి వచ్చిన అతడు యాజమాని గర్ధాస్ రామారావుతో కలిసి మిషన్ రంపం దారు పడుతుండగా ప్రమాదవశాత్తు రంపానికి కరెంట్ సరఫరా జరిగి విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు అప్పటికే మృతిచెందగా, రామారావు చికిత్స పొందుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా అసుపత్రికి తరలించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ తగిలి వృద్ధురాలు..


లక్ష్మి(ఫైల్)

చేగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ట్రాలీ తగిలి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండల పరిదిలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం చేటు చేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మొట్ట లక్ష్మి(73) గ్రామంలో పక్క ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నది. అదే సమయంలో గ్రామానికి చెందిన మొట్ట జానెష్ ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తుండగా లక్ష్మికి ట్రాలీ తగిలి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను తూప్రాన్ ఏరియా అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైదుయలు తెలిపారు. మృతురాలి మనుమడు చెంది రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సండే స్పెషల్ Sunday Special

'అన్నవరం'.. సాహితీ వనం


పోతారం(ఎస్)లోని ఇంట్లో దశరథం స్మారక స్థూపం

ఆ కుటుంబంలో రచయితలు.. చిత్రకారులు

ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే రాణింపు

సాహిత్య సుగంధం.. దశరథం సంతానం

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన అన్నవరం దశరథం శాలివాహన కుటుంబానికి చెందిన వారు. ఆయన తండ్రి మల్లయ్యకు గ్రామంలో ఒక పెద్ద పాటరీ వర్క్‌షాప్ ఉండేది. ఇందులో కుటుంబ సభ్యులంతా పనిచేసేవారు. ఆకాలంలో మల్లయ్య మౌఖిక కథలు, శాత్రాలు చెప్పేవారు. దశరథం బీఏ బీఈడీ పూర్తి చేసిన మొదటి తరం ఆదర్శ ఉపాధ్యాయుడు. ఆయన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే చిత్రకళ రంగంపై ఆసక్తి పెంచుకున్నారు. తన అందమైన చేతి రాతతో సైన్స్ బోర్డ్స్‌ను రాసేవారు. ఆయనకు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. 2015లో దశరథం అనారోగ్యంతో పరమపదించారు. ఆయన వారసులు పోతారం(ఎస్)లోని ఇంటి ఆవరణలో త్రిభుజాకారంలో గ్రానైట్‌తో స్థూపాన్ని నిర్మించారు. ఉద్యోగ రీత్యా కుమారులు, కూతుళ్ల కరీంనగర్, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కానీ ప్రతి ఏటా సెప్టెంబర్ 11న తమ తండ్రి వర్థంతికి కుటుంబంతో సహా వచ్చి ఇంటి వాకిట్లో వర్థంతిని నిర్వహిస్తారు. ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటారు.


అన్నవరం దశరథం

మట్టి పరిమళపు అల్లిక.. దేవేందర్ కవిత్వం

దశరథం పెద్ద కుమారుడు అన్నవరం దేవేందర్. ఆయన ఎంఏ సామాజిక శాస్త్రం చదివారు. పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగం చేసి, 2020 అక్టోబరులో ఉద్యోగ విరమణ చేశారు. మూడు దశాబ్దాలకుపైగా ఉద్యోగం చేస్తూ రచనా రంగంలోనూ కొనసాగారు. కవి, రచయిత కాలమిస్టుగా ఇరవై అయిదేళ్లుగా నిరంతరం కవిత్వం రాస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ పల్లె మట్టి భాషలో కవిత్వం అల్లుతారు. తెలంగాణ భాషకు సాహిత్య గౌరవం తెచ్చిన వారిలో అన్నవరం దేవేందర్ ముందుంటారు. 2001లో 'తొవ్వ'తో ఆయన కవిత్వ ప్రయాణం మొదలుపెట్టగా ఇప్పటికీ 17 పుస్తకాలను వెలువరించారు. ఇందులో 12 కవితా సంపుటాలు, రెండు ఆంగ్ల అనువాద కవిత్వం, మూడు వ్యాస సంకలనాలు ఉన్నాయి. 2020లో ఉద్యోగ విరమణ అనంతరం 2022లో అన్నవరం దేవేందర్ కవిత్వం 1988-2022 సమగ్ర కవిత్వా సంపుటి, 2023లో 'సంచారం' యాత్ర సాహిత్య వ్యాసాలు వెలువరించారు. ఇటీవలనే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మేర మల్లేశం స్వీయ చరిత్ర పాటల పుస్తకానికి పరిశోధక సంపాదకుడిగా వ్యవహరించారు. దేవేందర్ కాకతీయ విశ్వవిద్యాలయంలో కవిత్వంపై ఎంఫిల్ పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆయన రచించిన మంకమ్మతోట లేబర్ అడ్డా అనే కవిత కాకతీయ విశ్వవిద్యాలయం బీఏ స్పెషల్ తెలుగు విద్యార్థులకు పాఠ్యమైంది. ఎన్నో పుస్తకాలకు సంపాదకులుగా వ్యవహరించారు. అన్నవరం కవిత్వం పొక్కిలి వాకిళ్ల పులకరింతకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం లభించింది. ఊరిదస్తూరి పుస్తకానికి తెలంగాణ సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారం ప్రకటించారు. గవాయి కవితా సంపుటికి సాహితీ గౌతమి, సినారె పురస్కారం వరించింది. రంగినేని ఎల్లమ్మ, అలిశెట్టి ప్రభాకర్, మారసం రుద్రరవి, ఉమ్మిడిశెట్టి ప్రతిభా, వానమామలై, జగన్నాథాచార్య పురస్కారాలతో పాటు మరెన్నో అందుకున్నారు. 1985లో జీవగడ్డ పత్రికతో మొదలైన దేవేందర్ జర్నలిజం ప్రస్థానం 'ఆంధ్రజ్యోతి'తో పాటు వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. ఇప్పటికీ కవిత్వంతో పాటు పలు పత్రికల్లో కాలమ్స్ రాస్తున్నారు. ఈయన రాసిన 'ఊరి దస్తూరి' కాలం చాల విశిష్టమైంది. ఇది తెలంగాణ సాంస్కృతిక చిత్రీకరణ పుస్తకంగా వెలువడింది. ఇప్పటికి దేవేందర్ పలు దిన పత్రికలకు సాహిత్యం, పత్రికా రచనలు కొనసాగిస్తున్నారు. అంతరంగం, సోపతి, ఊరి సామెతలు, ఆదివారం అనుబంధంకు కాలం రాస్తున్నారు.


అన్నవరం దేవేందర్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి, కవి, రచయిత, కాలమిస్ట్

నుడికారపు కమ్మదనం.. సుజాత కవిత్వం


నాంపల్లి సుజాత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కవి, రచయిత

దశరథం సంతానంలో పెద్దకూతురు సుజాత. వారి ఇంట్లోని సాహితీ వాతావరణం సుజాతను కూడా రచయితను చేసింది. తండ్రి ప్రోత్సాహంతో.. అన్న సాహిత్య రచనలను ఆకళింపు చేసుకున్నారు. వివాహనంతరం ఉన్నత చదువులు చదువుకుని ప్రభుత్వ ఉపాధ్యాయురాలయ్యారు. బహుజన మహిళా చైతన్యానికి అవకాశమే లేని సమాజంలో స్వయంసిద్ధిగా ఎదిగిన కవయిత్రి సుజాత. తెలంగాణ పలుకుబడి నుడికారాలతో పల్లెటూరి భాషా సౌందర్యంతో రచనలు మొదలుపెట్టి.. బాధిత జీవితాల చిత్రమాలికలను కళ్లకు కట్టిన సజీవ సాక్ష్యంలా కవిత్వం రాస్తున్నారు. ఆమె రచనల్లో ప్రతీ అంశంలో ఆర్ద్రత, బాధ్యత సమపాళ్లలో స్పటిక సాదృశ్యంగా కదలాడుతుంటాయి. ఇంతవరకు నెమలీకలు, మట్టి నా ఆలాపన, మట్టి నానీలు, జొన్నకంకి, హోంమేకర్ కవితా సంపుటాలను వెలువరిచారు. ఆరో పుస్తకంగా సాహిత్య వ్యాసాలు, కుదురు ముద్రణ దశలో ఉన్నాయి.

కవర్‌పేజీ బొమ్మలకు కేరాఫ్ శ్రీనివాస్

దశరథం చిన్న కుమారుడు అన్నవరం శ్రీనివాస్ తన తాత మల్లయ్య పాటరీ వర్క్‌షాప్‌లో పనిచేసేటప్పుడు కుండలు, పాత్రలు, జాడీలు తయారీని పరిశీలిస్తూ ఉండేవారు. చెరువు మట్టిని తీసుకొచ్చి చక్రం తిప్పి ఒక ఆకారం చేయడం ఆయనను బాల్యంలోనే ఆలోచింపచేసింది. చదువుతో పాటుగా తండ్రి గీచిన చిత్రాలు, చేతిరాతలను చూసి ఆసక్తి పెంపొందించుకున్నాడు. పాఠశాల స్థాయిలోనే సబ్బు బిల్లలపై చిత్రాలను చెక్కేవారు. శ్రీనివాస్ ప్రభుత్వ జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రెండున్నర దశాబ్దాలుగా చిత్రకళా రంగంలో ప్రఖ్యాతి పొందారు. 2004లో ఆయన సుమారు 100 క్యారెక్టర్లతో ఒక పెయింటింగ్ వేశారు. ఒక గ్రామంలో 'పెళ్లి ఊరేగింపు'లో అన్ని వర్గాలకు చెందిన వారు పాల్గొనడం అనే అంశానికి దృశ్యరూపం ఇచ్చారు. కెఫే డే ఆర్ట్ షో, న్యూఢిల్లీలో విజువల్ ఆర్ట్ గ్యాలరీ, సాలార్జంగ్ మ్యూజియం, ఫలక్‌నుమా ప్యాలెస్, తారామతి బారాదరిలో శ్రీనివాస్ చిత్రాలు ప్రదర్శించపడ్డాయి. ఆర్ట్ ఎట్ తెలంగాణ సంస్థ వివిధ సందర్భాల్లో నిర్వహించిన వర్క్‌షాపుల్లోనూ ప్రదర్శింపబడ్డాయి. ఆన్‌లైన్ ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనలోనూ శ్రీనివాస్ చిత్రాలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన వేసిన ఎన్నో కార్టూన్లు పలు పత్రికల్లో అచ్చు అయ్యాయి. కవులు, రచయితలకు చెందిన దాదాపు 500పైచిలుకు పుస్తకాలకు కవర్ పేజీ బొమ్మలు గీశారు. శ్రీనివాస్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి చిత్రలేఖన విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఇదే కాకుండా పీటిరెడ్డి ఆర్ట్ అవార్డు, రైటర్స్ కార్నర్ ఇంటర్నేషనల్ అవార్డు, బీఎస్ రాములు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు వరించాయి.


అన్నవరం శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కార్టూనిస్ట్

కథా రచయిత్రి రాజేశ్వరి దేవేందర్


రాజేశ్వరి దేవేందర్ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కథా రచయిత్రి

అన్నవరం దశరథం కుటుంబంలో పెద్దకోడలు ఎదునూరి రాజేశ్వరి.. దేవేందర్ సతీమణి. రాజేశ్వరి వివాహం అయిన తర్వాత ఉన్నత చదువులు చదువుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా స్థిరపడ్డారు. ఇంట్లోని సాహిత్య వాతావరణంతో కథా రచయిత్రిగా మారారు. ఇప్పటికీ ఆమె 12 కథలు పత్రికల్లో అచ్చయ్యాయి. త్వరలో పుస్తకం వెలువడబోతోంది. ఆమె రచనలు రాష్ట్రస్థాయిలో వెలువడుతున్న కథా సంకలనాల్లో చోటు దక్కించుకుంది.


క్లినిక్‌ను సీజ్‌చేస్తున్న వైద్యాధికారులు

ప్రజల ప్రాణాలతో చెలగాటం తగదు

● జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద్

మిరుదొడ్డి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే ప్రజలప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రోగ్రాం అధికారి ఆనంద్, డీప్యూటీ డీఎంహెచ్‌వో రేవతి హెచ్చరించారు. శనివారం మిరుదొడ్డిలోని క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్‌ను వారు తనీఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు అనుమతిలేకుండా డయాగ్నొస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనంతరం మిరుదొడ్డిలో మల్లికార్జున క్లినిక్‌తోపాటు ల్యాబ్‌ను సీజ్‌చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సమీనా, రమేష్, సత్యానారాయణ తదితరులున్నారు.

మాలలంతా ఏకమై కుట్రలను తిప్పికొట్టాలి

● జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్


అక్బర్‌పేటకు చేరుకున్న మాలల మహాపాదయాత్ర

దుబ్బాక/మిరుదొడ్డి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మాలలపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టడానికి మాలలంతా ఏకం కావాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. గత నెల 25న భద్రాచలంలో చేపట్టిన మాలల మహాపాదయాత్ర శనివారం దుబ్బాక మండలం లచ్చపేట, చౌదర్‌పల్లి, అక్బర్‌పేట మండలానికి చేరుకుంది. స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎస్సీలను విడదీసి రాజకీయంగా అణగదొక్కలానే కుట్రలో భాగంగా ఎస్సీ వర్గీకరణను చేపట్టిందన్నారు. దేశంలో బహుజనుల రాజ్యం వస్తుందనే భయంతో కేంద్రం నీచమైన కుట్రలకు పాల్పడుతుందన్నారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల మహాసంగ్రామ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్రప్రధానకార్యదర్శి వెన్నరాజు, సత్యనారాయణ, అంజయ్య, ర్యాకం శ్రీరాములు, భీమసేనా, పురుశోత్తం, రాజేశం, దేవయ్య, యాదగిరి, జడీపల్లి రవి, సురేష్, కిషన్, యాదగిరి, సుమన్ తదితరులున్నారు.

అట్టహాసంగా గ్రామోత్సవ క్రీడలు


క్రీడలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో ఖాసీంబేగ్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో 16వ గ్రామోత్సవ క్రీడలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి 25 వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. ముఖ్యఅతిథిగా యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ హాజరై ప్రసంగించారు. క్రీడల్లో రాణించే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం డీవైఎస్‌వో ఖాసీంబేగ్ సమక్షంలో వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఆ తర్వాత దక్షిణ భారతదేశ రాష్ట్రాల పోటీల్లో తలపడుతారని ఈశా ఫౌండేషన్ నిర్వహకురాలు వసుధ తెలిపారు. విజేతలకు నగదు బహుమతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మచ్చేందర్, తులసీదాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం గ్రామోత్సవ క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడల కోఆర్డినేటర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన క్రీడాపోటీల్లో ఆయా మండలాలకు చెందిన మహిళలు తలపడ్డారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, ఆయా గ్రామాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆదర్శ పాటశాలలో క్రీడాపోటీల్లో పాల్గొన్న మహిళలు



ఫైనాన్స్‌వారి వేధింపులు

● బైక్‌కు నిప్పంటించిన యువకుడు

శివ్వంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఫైనాన్స్‌లో తీసుకున్న ద్విచక్ర వాహనం ఈఎంఐ కోసం ఫైనాన్స్ ప్రతినిధులు ఇంటికి రావడంతో మనోవేదనకు గురైన యువకుడు తన బైక్‌కు నిప్పంటించి దగ్ధం చేసిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేటలో శనివారం జరిగింది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన ఓ యువకుడు ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఈఎంఐ పద్ధతిలో బైక్ కొనుగోలు చేశాడు. ఈఎంఐలు మొత్తం చెల్లించగా, ఇంకా ఐదు నుంచి ఆరు వేల బకాయి ఉంది. ఈ బకాయి కోసం ఫైనాన్స్ ప్రతినిధులు శనివారం ఇంటికి రాగా, మనోవేదనకు గురైన యువకుడు వారి ముందే బైక్‌కు నిప్పంటించడంతో అది పూర్తిగా కాలిపోయింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కళాజాతను అడ్డుకున్న రైతులు

● ప్రభుత్వం ఏం చేసిందంటూ మండిపాటు


కళాజాత కళాకారులను అడ్డుకుంటున్న రైతులు

సంగారెడ్డి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండల కేంద్రంలో ప్రభుత్వ కళాజాతను శనివారం రైతులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండటంతో ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రచార ప్రదర్శన కళాకారులు శనివారం పుల్కల్‌కు వచ్చారు. శనివారం మార్కెట్ ఉండటంతో కళాకారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పాటలు పాడుతున్నారు. ఈ క్రమంలో పలువురు మహిళలు, రైతులు కళాకారుల వద్దకు చేరుకుని వారిని అడ్డుకున్నారు. రుణమాఫీ సక్రమంగా అమలు చేయకపోయిన చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారంటూ, ఎంత మందికి రుణమాఫీ జరిగిందో చెప్పాలంటూ స్థానిక రైతులు కళాకారులను నిలదీశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని రెండు, మూడు పథకాలు తప్పా ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ప్రజలను నమ్మించి మోసం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు లేదు, రుణమాఫీ సక్రమంగా చేయకపోయినప్పటికీ గొప్పగా ప్రచారం చేసుకోవడమేమిటంటూ నిలదీశారు. ఏం చేశామని గ్రామాలకు వస్తున్నారంటూ ప్రచార కళాకారులను అడ్డుకుని అక్కడి నుండి పంపించి వేశారు. ఏం ఒరగబెట్టారని ప్రభుత్వం ఉత్సవాలు జరుపుకుంటుందో తెలపాలంటూ కళాకారులపై మండిపడగా, చేసేదిలేక కళాకారులు వెనుదిరిగారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక విద్యా శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలో రైతులు నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమయింది.

హైకోర్టు జడ్జి ఇంటికి కలెక్టర్

బెజ్జంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు జడ్జి నచ్చరాజు శ్రవణ్ కుమార్ స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామంలో సందడి నెలకొంది. ఆయన ప్రథమ కుమార్తె మధురిమ వివాహం గత నెల 27న హైదరాబాదులో జరగగా, శనివారం తన నివాసంలో గ్రామస్థులకు విందు ఏర్పాటు చేశారు. కలెక్టర్ మనుచౌదరి, జిల్లా జడ్జి సాయి రమాదేవి, డీపీఓ దేవకీదేవి, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. కలెక్టర్, జిల్లా జడ్జిలకు హైకోర్టు జడ్జి దంపతులు శ్రవణ్ కుమార్, కవిత మెమొంటోను అందజేశారు.


జిల్లా కలెక్టర్‌కు మెమొంటోను అందజేస్తున్న హైకోర్టు జడ్జి దంపతులు

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌కుమార్ తెలిపారు. ప్రొఫెసర్ 7, అసోసియేట్ ప్రొఫెసర్ 10, అసిస్టెంట్ ప్రొఫెసర్ 30, సీనియర్ రెసిడెంట్ 19, ట్యూటర్ 3 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన, ఆసక్తి కలిగి ఉన్న అభ్యర్థులు సోమవారం, మంగళవారం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం వాకింగ్ ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

మాసాయిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలో శనివారం తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శోభన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో లీలావతి, పీఈటీ శ్యాం సుందర్‌శర్మ, వ్యాయామ ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పైనే వారాంతపు సంత

- కనీస సదుపాయాలు కరువు
- మినీ రైతు బజార్లు ఏర్పాటు చేయాలని అమ్మకందారుల విజ్ఞప్తి


ముంద్రాయిలో రోడ్డుపైనే కొనసాగుతున్న వారాంతపు సంత

నంగునూరు,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సరుకులు, కూరగాయలు విక్రయించేందుకు నిర్వహించే వారాంత సంతలో కనీస వసతులు లేక అటు వ్యాపారులు ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలకు వెళ్లి కూరగాయలు ఇతరత్రా వస్తువులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడకుండా గ్రామాల్లో సంతను నిర్వహిస్తున్నారు. నంగునూరు మండలం ముంద్రాయిలో ప్రతి శనివారం కూరగాయల సంత నిర్వహిస్తారు. ఈ సంతలో ముంద్రాయి, రాజగోపాలపేట, కోనాయపల్లి, వెల్కటూర్, మండపల్లి గ్రామాల నుంచి ప్రజలు వచ్చి కూరగాయలు ఇతరత్రా వస్తులు కొనుగోలు చేస్తారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సంతలో దుమ్ము దూళితో వ్యాపారులు వినియోగదారులు ఇబ్బందులు గురవుతున్నారు. ముంద్రాయి గ్రామం వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో ప్రధాన చౌరస్తాలో దుమ్ము ధూళి మధ్యనే సంత కొనసాగుతున్నది. ప్రతివారం జరిగే సంతలో కనీస వసతులు కల్పించాలని, అలాగే ప్రజల అవసరాలకు అనుగుణంగా మినీ రైతు బజార్లు ఏర్పాటు చేసి వ్యాపారులకు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతి

చేర్యాల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి హైదరాబాద్‌లో శనివారం వినతిపత్రం అందించారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి గతంలో సిద్దిపేట పట్టణంలోని పలు చౌరస్తాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆరుగురు మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి వారికి రూ.6500 జరిమానా విధించారు.

విద్యుత్ తీగలను సరిచేసిన అధికారులు



వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

అక్కన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంద నవానిపల్లిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న విషయమై ఈనెల 22న 'యమపాశాలుగా విద్యుత్ తీగలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. శనివారం కుందనవానిపల్లిలో వ్యవసాయ బావుల వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేశారు. దీంతో రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞలు తెలిపారు.

కొమురవెల్లి జడ్పీఎస్ఎస్‌లో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్ పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు, ఓటింగ్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ కొమురవెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీఎస్ఎస్‌లో శనివారం గ్రామపంచాయతీ ఎన్నికల మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సాధారణ ఎన్నికల ప్రక్రియ మాదిరిగా నోటిఫికేషన్, నామినేషన్ దాఖలు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, ప్రచారం, అభ్యర్థుల హామీల మ్యానిఫెస్టోతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ పేపర్స్, ఓటింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌ను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, ఎంఈవో రాములు, కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీసభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలకు పెంచాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ పెంచి, ఇతర చేయూత పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తు శనివారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, టీహెచ్‌పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛను రూ. 6000 వేలకు పెంచాలని, వృద్ధులు, వితంతువులకు ఇతర చేయూత పింఛన్ రూ. రూ. 4000 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయాలని తదితర అంశాలపై దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని దివ్యాంగుల సంఘం నాయకులు కోరారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కోర్టు భవనాన్ని పరిశీలించిన సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చేర్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిఫ్‌కోర్టు భవనాన్ని శనివారం సిద్దిపేట జిల్లా ప్రధానన్యాయమూర్తి సాయిరమాదేవి పరిశీలించారు. ఆమెవెంట తహసీల్దారు సమీర్‌అహ్మద్‌ఖాన్, సీఐ శ్రీను, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, న్యాయవాదులు మనోహర్, సురేందర్, రాములు, సురేందర్, మహేందర్ ఉన్నారు.


కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జి సాయిరమాదేవి

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న గజ్వేల్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ప్రిన్సిపల్ అదనపు సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.ప్రియాంక సూచించారు. గజ్వేల్ పట్టణంలోని న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ.. రాజీపడదగిన కేసులను సత్వర, సమన్యాయం కోసం లోక్ అదాలత్ చక్కని వేదిక అన్నారు. ఈ సమావేశంలో సీఐ సైదా, ఎస్ఐలు దామోదర్, కరుణాకర్ రెడ్డి, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


కోఆర్డినేషన్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

అన్ని విషయాలపై న్యాయవాదులకు అవగాహన అవసరమని గజ్వేల్ ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. ప్రియాంక అన్నారు. గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నరాజ్ పాండరి ఆధ్వర్యంలో గజ్వేల్ న్యాయవాదులకు ఫోరెన్సిక్, ఫోర్జరీ, సీసీ ఫుటేజీ, ఫేస్ మార్ఫింగ్ అంశాలపై ప్రోబ్ ల్యాబ్ డైరెక్టర్ మోహన్ ఎర్రోళ్ల అవగాహన కల్పించగా, ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి ప్రియాంక హాజరయ్యారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక వృద్ధి

- ఏవో గుండు నాగరాజు


గజ్వేల్: సింగాటంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో నాగరాజు

గజ్వేల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికంగా వృద్ధి చెందుతారని గజ్వేల్ మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని సింగాటంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉందని, అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవన్నారు. స్థానికంగా నర్మేట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట ఏఈవో గణేశ్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

- మద్దూరు: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఏఈవో రాజు రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కొత్తగా ఆయిల్ పామ్‌సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడి ఇస్తారాన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు: ఏడీఏ మల్లయ్య

మిరుదొడ్డి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ మల్లయ్య హెచ్చరించారు. మిరుదొడ్డిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తూకంలో సుమారు కీలో వరకు అదనంగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

సమగ్ర సర్వే వివరాలు ఆన్‌లైన్‌లోకి..

- ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల్ని ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు శనివారం ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ తెలిపారు. మండలంలో గుర్తించిన 6018 కుటుంబాలకు గానూ అయిదుగురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో 53 మంది ఎన్యూమరేటర్లు 5100 కుటుంబాలకు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌వో మహేందర్, ఎంపీవో వీరరాజ ఉన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు


తొగుట: మొక్కలు నాటుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులు

తొగుట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి మాట్లాడారు. ఆరోగ్య పరిరరక్షణకు వృక్షాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, వేణుమాధవ్, హనుమారెడ్డి, బిక్షపతి, రవీందర్‌రెడ్డి, సీఆర్‌పీ వెంకటస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

- చేర్యాల: చేర్యాల మండలం శబాష్‌గూడెం ఎంపీపీఎస్ ఆవరణలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాగుల రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు మరాఠీ సంతోశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

'క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్'


పరుగు పందెంలో విద్యార్థులు

సిద్దిపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులకు, శిక్షకులకు మంచిపేరు తేవాలని అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

దూళిమిట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు దూళిమిట్ట ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు రిత్విక్, రాహుల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సతీష్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆపద సమయంలో అండగా అభయ

- యాప్‌పై అవగాహన కల్పించిన పోలీసులు


ఆటో డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆపద, అత్యవసర సమయంలో మీ ప్రయాణానికి ఇబ్బంది అనిపించిన, ఆటో డ్రైవర్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు ఉన్న వెంటనే అభయ యాప్ వినియోగించుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐ సదాశివ రావు, ఉమేష్ అవగాహన కల్పించారు. అభయ యాప్ గురించి సిద్దిపేట పట్టణంలో చౌరస్తాల్లో శనివారం ఆటోడ్రైవర్లకు, ప్రజలకు, విద్యార్థులకు అభయ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించిన, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, హిట్ అండ్ రన్ చేసిన ఈ అప్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చు అని తెలియజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

గజ్వేల్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గజ్వేల్ బాలుర హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులకు ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంఏ తెలుగు, ఎంఏ ఎకనామిక్స్, ఎంకాం సబ్జెక్టుల్లో పీజీ కోర్సులు ఉన్నాయని, 55 శాతం మార్కులతో డిగ్రీ పాసైన విద్యార్థులు అర్హులు అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు ఫోటోలతో ఈ నెల 25న కళాశాలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఒకేషనల్ కోర్సులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

దుబ్బాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం దుబ్బాక జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత ఆధ్వర్యంలో 130 మంది విద్యార్థులు స్థానిక ఒకేషనల్ వృత్తి విద్యా కోర్సులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు శివకుమార్, సంతోష తదితరులున్నారు.

'కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం ఉధృతం చేద్దాం'

తొగుట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం ఉధృతం చేద్దామని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని లింగాపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న గజ్వేల్ పట్టణంలో సీఐటీయూ డివిజన్ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరాజు, శ్రీనివాస్, రవికుమార్, బండ్ల శ్రీనివాస్, యాదగిరి, మల్లేశం, సదయ్య, మహేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాస్ విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సిద్దిపేటలో సీ ఫిష్


సిద్దిపేటలో సముద్రం చేపలు అందుబాటులోకి వచ్చాయి. బుచ్చిబాబు, గణేష్ అనే తండ్రికుమారులు కాకినాడ పోర్టు నుంచి సిద్దిపేటకు తెచ్చి విక్రయిస్తున్నారు. అయితే ముందస్తుగా బుక్ చేసుకున్న వారికే అమ్ముతున్నారు. ముందుగా వాట్సప్ ద్వారా ఆర్డర్ చేస్తే ప్రతి శనివారం పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద వారు వాటిని అందజేస్తారు.

\- సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దీపోత్సవం


కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవంలో భాగంగా శనివారం ఆలయ ముఖ మండపంలో ఓం నమః శివాయ అక్షరమాలలో దీపాలు వెలిగించారు.

\- చేర్యాల

పాండురంగాశ్రమంలో బీర్ల ఐలయ్య పూజలు

మర్కుక్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ భావానంద పాండురంగ ఆశ్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండురంగాశ్రమంలోని రుక్మిణి కృష్ణ భగవాన్‌ను దర్శించుకుని కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్యాణమూర్తులకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత పట్టువస్త్రాలు, బియ్యం సమర్పించారు. అనంతరం ఆశ్రమం మొత్తం కలయ తిరిగి ఆశ్రమ చరిత్ర విశిష్టతను తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను వారి కుటుంబసభ్యులను ఆశ్రమ నిర్వాహకులు రసరాజశర్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.


ఆశ్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆరోగ్య పరిరక్షణ కోసమే వీక్లీ పరేడ్

- ఏఆర్ అదనపు డీసీపీ


పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణ కోసమే వీక్లీ పరేడ్ నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అదనపు డీసీపీ రామచంద్రరావు అన్నారు. పెద్దకోడూరు గ్రామ శివారులో ఉన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో శనివారం జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌లో మాట్లాడారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందన్నారు. సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ధరణికుమార్, పూర్ణచందర్, రాజేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.28 లక్షల మంజూరు

- వినతిపత్రం అందించిన వెంటనే స్పందించిన ఎంపీ

సిద్దిపేట అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలో ముదిరాజ్ కులస్థులకు గత ప్రభుత్వం కేటాయించిన ఎకరం స్థలంలో ముదిరాజ్ పిల్లలకు హాస్టల్ నిర్మించాలని ఆలోచన చేశారు. దానికి ముందుగా ప్రహరీ కావాలని ముదిరాజ్ సంఘం సభ్యులు శనివారం ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు భైరి శంకర్, తుపాకుల బాల్ రంగం తదితరులు మాట్లాడుతూ.. ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందజేసిన వెంటనే స్పందించి రూ. 28 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. నిధులు చేతికందగానే పని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చింతామడక రాజన్న, మల్యాల్ కిషన్, జక్కుల సిద్దిరాములు, కొన్నే వెంకన్న, ఎదుళ్ల నర్సింహులు, బస్సాపూర్ యాదన్న, మాచపూర్ చంద్రం, బొండ్ల రామస్వామి, తడ్కపల్లి వెంకట్, వెంకటేష్, సుతారి లింగం, వేణుగోపాల్, సుతారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన క్రీడాకారుడు ప్రశాంత్


ప్రశాంత్‌కు శాలువా కప్పుతున్న మాజీ సీఎం కేసీఆర్

గజ్వేల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ నేషనల్ ఫిజికల్లీ చాలెంజ్డ్ క్రికెట్ ఆఫ్ ఇండియా నిర్వహించే చాలెంజ్ ట్రోఫీ-2024 టీంకు ఎంపికయ్యాడు. ఈ మేరకు మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆయనవెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్యాణ్‌కర్ నర్సింగరావు తదితరులున్నారు.

'ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం'


శ్రీగిరిపల్లిలో దివ్యాంగులకు పాసులు అందజేస్తున్న అధికారులు

గజ్వేల్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని విలేజ్ బస్సు ఆఫీసర్లు ఆర్‌పిరెడ్డి, జయేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీపై బస్సు పాసులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రూరల్ సీఐ శ్రీను



సిద్దిపేట రూరల్: మాట్లాడుతున్న సీఐ శ్రీను

సిద్దిపేట రూరల్,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలు మనవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఆదర్శ పాఠశాలలో శనివారం విద్యార్థులకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అవగహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిందర్‌గౌడ్, అధ్యాపకులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, భరోసా సిబ్బంది హరిత, సోనీ పాల్గొన్నారు.

- గజ్వేల్: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బీ. సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ విద్యార్థులకు మహిళల రక్షణకు గల చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఫోక్సో, షీటీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయనవెంట షీటీమ్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ జీబై థామస్, అధ్యాపకులు ఉన్నారు.


సత్యసాయి 99వ జయంతి సందర్భంగా దుబ్బాక ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

\- దుబ్బాక